# తారకం - మారకం

విశ్వమందు విభుడు వెలుగొందుచుండును
విశ్వనాధుని యందు విశ్వము వెలుగుచుండు
విశ్వవిభులమైత్రి విడదీయరానిది
సత్యరత్నాలమూట ఈ సాయి మాట

## భగవంతుని సంకల్పమే మానవ జీవితము

విద్యార్థులారా, అధ్యాపకులారా, డాక్టర్స్ !

విశ్వమంతయు ఒక నాటక రంగము. ప్రతివ్యక్తి ఈ రంగమునందు ఒక యాక్టరు. కానీ ఈ యాక్టర్సు ఏవిధంగా వుండాలి. కర్తవ్యము నిర్వర్తించుటయే యాక్టర్ యొక్క ప్రధానమైన లక్ష్యముగా ఉండాలి. తన వ్యక్తిత్వము ప్రక్కన పెట్టాలి. ఈ విధంగా మీరు గడిచిన పండుగరోజు డ్రామా చూశారు. ఒకడు మున్సిపల్ ఛైర్‌మన్‌గా వేసాడు. మున్సిపల్ ఛైర్మన్‌గా వేసినపుడు మున్సిపల్ ఛైర్మన్‌గా నటించాలి గాని తను దీపక్ ఆనంద్‌లా నటన అక్కడ చేయటానికి వీలులేదు. దీపక్ ఆనంద్ అనే వ్యక్తిత్వమును ప్రక్కన పెట్టాలి. నీ కర్తవ్యమనే నాట్యమును ప్రదర్శించాలి. అయితే ఈ నాటకమునకు ఎవరు డైరెక్టరు? అంతా దైవ సంకల్పమే దీనికి మూలకారణము. ప్రతిమానవుడు దైవ సంకల్పము చేత ఆవిర్భవించినవాడే - తన కర్తవ్యమును నిర్వర్తించే నిమిత్తము మానవుడుగా జన్మించాడు. అయితే ఈ మానవత్వమును ప్రకటించాలి. ప్రదర్శించాలి గానీ తన వ్యక్తిత్వమును ఏ మాత్రం ప్రకటించడానికి వీలుకాదు. కనుక మంచి అయినను, చెడ్డ అయినను కథకు కారణమైనవాడు భగవంతుడే - కనుక తన సంకల్పములను చక్కగా నిర్వర్తించటమే ప్రతివ్యక్తి యొక్క కర్తవ్యము. ఇలాంటి కర్తవ్యమును దృష్టియందుంచుకొని మానవుడు తన వ్యక్తిత్వము ప్రక్కనపెట్టి జీవితములో ఈ జగత్తనే నాటక రంగమునందు తన యాక్షను చక్కని ఆదర్శముతో ప్రకటించాలి. అయితే ఈ నాటకమందు మంచి చెడ్డలు రెండూ కూడి

sri sathyasai vachanamrutam

వుంటాయి. యిక్కడ కేవలం రెండింటికి మధ్య మానవత్వం వికసిస్తూ వుంటుంది. ఈ రెండూ ఏమిటి? ఒకటి తారకము, రెండవది మారకము. తారకమనగా "ఏది నాది కాదు" అను భావన. ఏ డ్రామాలో ఎలాంటి యాక్ట్ చేస్తున్నప్పటికి, ఎలాంటి పదములు పలుకుతున్నప్పటికి యివన్నీ డైరెక్టరు యొక్క సంకల్పములే. ఏదియు నాది కాదు అని సర్వమును త్యజించి ఆ నాటకమునకు సంబంధించిన కథను మాత్రమే లక్ష్యమునందుంచుకొని తాను యాక్ట్ చేయటము సరైన తారకము. అయితే తారకమునకు, మారకమునకు వున్న వ్యత్యాసము ఏమిటి? మారకమునకు, తారకమునకు వ్యత్యాసము ఒక్కటే. తారకము అనేది నాది కాదు అని త్యజించి ఆ సంకల్పమునకు మూలకారణమైన భగవంతుని సంకల్పమును దృష్టి యందుంచుకొని ఆడటమే తారకము. కానీ అన్నియు నాదే, నేను చేస్తున్నాను. నేను ఈ విధంగా యాక్ట్ చేస్తున్నాను. యిదంతా నాకు సంబంధించినదే అను మమత్వము పెంచుకొని యాక్ట్ చేయడం మారకము. ఒక చిన్న ఉదాహరణము – మన కాలేజీలో ప్రిన్సిపాల్ ఉంటారు. ఈ కాలేజి యందుండిన అన్ని వస్తువులు, పదార్థములు, లేబొరేటరీలోనున్న మిషనులు, అన్ని క్లాసులలో ఉండిన చైర్సు కూడా అన్నింటకి తానే అధికారిగా ఉంటాడు. అన్నిటియందు అతి జాగ్రత్తను వహించి సంరక్షిస్తూంటాడు – కానీ ఆ ప్రిన్సిపాల్ స్థానమునుండి రిటైరైన తరువాత వాటిని చూచి ఏ మాత్రము విచారించడు. కారణం ఏమిటి? ఇది నాది కాదు. నేనుండినంతవరకు కర్తవ్యముగా నిర్వర్తించి కాపాడుకోవటం నా యొక్క విధి – కానీ రిటైర్ అయి యింటికి వెళుచున్నానే, నా హక్కులన్నీ విడిచి వెడుతున్నానే, లాబొరెటరీలోని మిషన్లు వదలి వెళ్లిపోతున్నానే అనే విచారమునకు ఏమాత్రము అవకాశముండదు. ఇది తారకము. అదే principal ఒక యింటిలో బాడుగకుండి, రిటైర్ అయిన తరువాత ఆ యిల్లును వదలి తన స్వంత యింటికి వెళ్లే సమయంలో తనవైనవి అన్నింటిని ప్యాక్ చేసి లారీలో ఉంచుతాడు. పాత చెప్పులు కూడా చుట్టి లారీలో వేస్తాడు. కారణం ఏమిటి? ఈ చెప్పులు నావి అనే మమత్వము చేత వాటిని ప్యాక్ చేసి తన వెంట తీసుకువెడతాడు. ఇదే మారకము. అంతకంటే ఎంతో విలువైన సామాను కాలేజీలో ఉండినప్పటికి దానిని వదలివెళ్లే సమయంలో ఏ మాత్రము విచారించడు. తారకమనగా తన కర్తవ్యము నిర్వర్తించి సామాను

కాపాడుకోవటం ,అక్కడ మమత్వం ఏ మాత్రము ఉండదు. విలువైనదీ అయినా, విలువ కానిదైనా వీటిపై తన ప్రభావము ఏమాత్రము ఉండదు. కానీ తాను తిరిగి స్వస్థానమునకు వెళ్లే సమయంలో ఇంటిలోనివన్నీ తనవేయని ప్యాక్ చేసి తన వెంట తీసుకుపోతుంటాడు. మమత్వముతో కూడినది మారకము, మమత్వము లేనిది తారకము. న-మమ, అది నిజమైన తారకము. మమ అనేది మారకము. అదేవిధముగా ఈనాటి మానవుడు ప్రతి చిన్న విషయమును మమత్వముచేత పెంచుకొని పనికిమాలినవి కూడా తలపై వేసుకొని కాలమును, కర్మమును, కర్తవ్యమును తాను విస్మరించి వాటి నిమిత్తమై తాను అనేక విధములుగా ప్రాకులాడుతున్నాడు. మనస్సు అనేదాన్ని విషయములపై ప్రసరింపజేసినపుడు బంధితమవుతుంది. ఈ నెగిటివ్స్‌పై మనస్సు పెట్టుకొని దాని నిమిత్తమైన ప్రాకులాడటము యిది కేవలం మారకమవుతుంది. ఎంత విలువైనవో తనయందున్నప్పటికీ వాటిని త్యజించి ఈవిధముగా పాటుపడుతూ ఉంటాడు మమత్వముతో కూడినవాడు.

విలువలేని యినుపపెట్టి ఈ దేహము, యిలాంటి దానిలో విలువ గలిగిన నగలన్నీ పెడుతున్నాము. కానీ దాచబడేది ప్రధానము. ఈ దేహము దేవాలయం వంటిది. యిందులోనున్న దేహి విదేశీ వజ్రము వంటివాడు. పెట్టిలోన నగలు పెట్టినపుడు, నగలకా విలువ? పెట్టెకా? నగలే విలువైనవి. అదే విధముగా మానవుని యందు నిత్యసత్యమై, నిరంతరము సరైన మార్గమున నడిపించెడి దేహి తత్త్వము విస్మరించి, లౌకికమైన ప్రాకృతమైన అనిత్యమైన పదార్థములకు ప్రాకులాడుతున్నాడు. కనుకనే మానవుడు యిన్ని బంధాలకు చేరి తను బాధలకు గురౌతున్నాడు. దీనికి కారణం ఏమిటి? అంతఃకరణ చతుష్టయమనే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము మూలకారణములు. కన్నులు దేనినైనా చూడాలని ఆశిస్తున్నాయి. ఎలాంటివి చూడాలో విచారించటం లేదు. కన్నులున్నవికాదా అని ఊరికే చూడటం మన లక్ష్యముగా ఉండకూడదు. చూడటం కన్నుల లక్షణమే, కాని ఎలాంటి దానిని చూడాలి? చెవులకు వినటం చాలా అభిరుచి. ఎలాంటి దానిని వినాలనే ప్రశ్న వేసుకోవడం లేదు. తినటం నోటికి లక్షణమే, కానీ ఏమి తినాలి అనేది విచారించటం లేదు. వాసన చూడటం ముక్కు లక్షణమే. కానీ ఎలాంటి దానిని వాసన

sri sathyasai vacharamrutam

చూడాలి, చేతితో తాకటము చేతి లక్షణమే - కానీ దేనిని తాక కూడదు అనేది విచారించటం లేదు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు ఈ పంచేంద్రియముల లక్షణములు, మానవునకు ప్రధానమైనవి. ఈ పంచేంద్రియముల యొక్క నెగిటివ్ లక్షణముల చేత మానవుడు పాపమునకు గురౌతున్నాడు. ఈ పాపము నుంచి తాను విముక్తుడు కావాలి. ఏవిధంగా విముక్తుడు కావటానికి వీలవుతుంది? నీవు చూడవలసింది చూడు, వినవలసింది విను, తినవలసింది తిను, వాసన చూడవలసింది వాసనచూడు, తాకవలసింది తాకు. అదే నేను అప్పుడప్పుడు చెబుతాను.

**See no evil, see what is good**
**Hear no evil, hear what is good**
**Talk no evil, talk what is good**
**Do no evil, do what is good**
**Think no evil, think what is good.**

ఈ పదములు చాలా చిన్నగా ఉంటున్నాయి గానీ, యిందులోనే సర్వబంధములు చేరి ఉంటున్నాయి.

బంధనే మానవునికి నిజమైన పెనుభూతము. ఈ పెను భూతము నుండి తప్పించుకొని, నిర్బంధము నుండి పోయి సంబంధము కల్పించుకోవాలి. కనుక బంధ విముక్తులకు మూలకారణం మనస్సే. మనస్సే అన్నింటిని కోరుతున్నాది. కోరినది విషయమా, విషమా అని విచారించాలి. విషయములన్నీ విషముతో సమానమే. ఈ మనస్సును విషయములపై పోనివ్వకుండా చూచుకోవాలి. ఒకవేళ పోయినప్పటికీ అందులో ఉత్తమమైనదానిని ఆకర్షించుకోవాలి. ముక్కుతో వాసన చూస్తున్నారు. సుగంధాన్ని మాత్రమే చూడాలని ఆశిస్తున్నారు. కానీ సుగంధముతో పాటు ప్రాణవాయువును కూడా ఉచ్ఛ్వాస నిశ్వాసములతో ఆకర్షించాలి. ఆకలి తీరటానికి అన్నం భుజిస్తున్నారు. కానీ ఈ అన్నము కూడా ఆరోగ్యము అందించే అన్నముగా భుజించాలి. అదే విధంగా TV నందో, రేడియోలోనో పిచ్చి పిచ్చి విషయాలంతా వింటున్నారు. ఇదికాదు వినవలసినది, హృదయాన్ని ఆనందపరిచే విషయాన్ని వినాలి. అంత:కరణమునకు ఆనందమిచ్చే

srisathyasaivachanamrutam

విషయాన్నే వినాలి. అదే అంతఃకరణ తత్వము యొక్క విచారణ. దీనినే మనము నెగిటివ్, పోజిటివ్ అని పెట్టుకుంటూ వచ్చాము. నెగిటివ్ మానవునకు అనవసరమైనది. అనవసరమైన వాటినంతా వింటున్నారు. ఆ నెగిటివ్ మీలో చేరిన తరువాత అనేక రకములైన బాధలు వెంటాడుతూ వస్తున్నాయి. ఈనాడు మానవుడు ఆశించేదంతా పోజిటివ్ కానీ హృదయము నిండుకు నింపుకున్నది నెగిటివ్స్. హృదయము నిండుగా నెగిటివ్స్ నింపుకొని positives కావాలంటే ఎలా లభ్యమవుతాయి. దీనికి ఒక చిన్న ఉదాహరణము పిల్లలు పాడుతున్నారు. నిత్యము అనేక కొత్తకొత్త tunes వేసి పాడుతున్నారు. Tunes చూస్తుంటే ఒక్కొక్క పాటకు నూతనమైన ఉత్తేజంగా కనిపిస్తుంటాయి. ఉత్తేజమైన రాగములచేత, ఉత్సాహమైన మనస్సుచేత ఈ పాటలు, భజనలు సల్పుతున్నారు. Tunes ఆకర్షణీయంగా ఉంటున్నాయి. పదములు చాలా ఆనందమైనవిగా ఉంటున్నాయి. విషయము చూస్తే చాలా ఆనందకరమైనదిగా కనిపిస్తున్నది. కానీ హృదయము ఎట్లున్నది అనునది ప్రధానమైనది. హృదయము లోపల దుష్ట భావములు, పశు భావములు, మృగ భావములు ఉంచుకొని పైన ఎన్ని విధములైన భజన సల్పినా గానీ ఆకర్షణీయ మవుతుందా? బయట రాగములు, బయట తాళములు, యివన్నీ కేవలం నెగిటివ్‌తో కూడినవే. లోపల భావము పరిశుద్ధమై, పరిపూర్ణమై, ఆనందమై, స్వార్థరహితమై ఉండినటువంటిదే నిజమైన పాజిటివ్. కనుక పాజిటివ్‌ను అభివృద్ధిపరచుకోవడానికి ప్రయత్నం చేయాలిగానీ నెగిటివ్‌వల్ల వచ్చే ఫలితమేమీ లేదు. ఈనాడు ప్రతి మానవుడు నెగిటవ్‌పైననే లక్ష్యముంచి పాజిటివ్‌ను విస్మరించి తన నిత్యజీవితము జరుపుతున్నాడు. మనసుకు సంబంధించిన ప్రతీ కర్మ నెగిటివ్, హృదయమునకు సంబంధించిన ప్రతీ పని పాజిటివ్. హృదయమునకు సంబంధించిన పని దినదినమునకు అభివృద్ధి గావించుకోవాలి గానీ దేహమునకు సంబంధించినది అభివృద్ధి గావించుకోవటం గొప్పదనము కాదు.

కనుకనే 'జంతూనాం నరజన్మ దుర్లభమ్' మానవజన్మ భగవంతుని సంకల్పముతో అందుకున్న ఒక ఉత్తమమైన కానుక. ఇట్టి భగవంతుని నుండి అందుకున్న కానుక ఎంత చక్కగా మనము ఉపయోగించుకోవాలి. ఎంత భద్రముగా దీన్ని చూచుకోవాలి. ఎంత

sri sathyasai vachanamrutam

పవిత్రమైనదిగా దీనిని అనుభవించాలి. ఎంత సార్థకమైనదిగా దీనిని అనుభవించాలి. ఎంత సత్కర్మలతో కూడినదిగా అనుభవించాలి. ఆ పాజిటివ్ లక్షణాలు నేటి మానవునియందు ఏమాత్రం కనిపించటం లేదు. దేహమున్నది. చేతులతో ఏమైనా చేయవచ్చు. కాదు. చేతుల నందించినది దేనికోసమని. సత్కర్మలమయమై ఉండాలి. శిరస్సు దేనికోసం అందించినది? సచ్చింతనతో నిండి ఉండాలి. హృదయము ఏవిధంగా ఉండాలి? పరిపూర్ణమైన దయతో నిండి ఉండాలి. ఈ దయ హృదయములో లేకుండా, త్యాగభావములు శిరస్సులో లేకుండా, స్వార్థరహితమైన కర్మలు చేతిలో లేకుండా ఎన్ని పనులు చేసి ప్రయోజనం ఏమిటి? ఇవన్నీ పాజిటివ్‌తో జరిగిపోతున్నాయని అనుకుంటున్నారు. కాదు. కాదు. అంతా నెగిటివ్‌తో కూడి ఉంటున్నాయి. ఏనాడు నీ హృదయము దయతో నిండి ఉండునో అదే నీకు నిజమైన పాజిటివ్. ఏ చేతులు స్వార్థరహితమైన కర్మలలో ప్రవేశించునో అదే నీకు నిజమైన పాజిటివ్. ఏ శిరస్సు పవిత్రమైన సచ్చింతనతో ఉండునో అదియే నిజమైన పాజిటివ్. ఈనాటి విద్యార్థులుగానీ లేక పెద్దలు గానీ నెగిటివ్ విషయాలు గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలి. ప్రతిదానికి నాలుక చాలా ప్రధానమైనది. మనస్సు బుద్ధి చిత్తము అంతఃకరణ అయితే ఈ నాల్గు దేనికి సంబంధించినవి. దేహమునకు సంబంధించినవి. దేహముతో కూడినవే యింద్రియములు. దేహముతో కూడినదే మనస్సు. దేహముతో కూడినదే యీ బుద్ధి. దేహముతో కూడినదే అంతఃకరణ. దేహమే నేను అనే భావము ఉండినంతవరకు వీడు నెగిటివ్‌లోనే జీవిస్తుంటాడు. ఈ దేహము నేను కాదనుకున్నప్పుడు ఏ విచారము ఉండదు. ఈ ఇంద్రియముల కంతా నేను అధిపతిని. I am the master. ఇంద్రియములు instruments. కనుకనే be a master. నీవు master గా ఉంటున్నప్పుడు ఆ master mind ను సంపాయించుకోటమే నిజమైన ముక్తి అన్నాడు. Master the mind, be a master mind. ఈ రకమైన తత్వమును గుర్తించుకొని మోక్షమునకు తగిన కృషి సల్పాలి. మోక్షము ఎప్పుడో చచ్చిన తరువాత లభించేది కాదు. చిన్నతనమునుండి అడుగడుకు యీ లిబరేషనును గుర్తిస్తూ పోవాలి. దీనినే freedom అని చెబుతూ వచ్చారు. మోక్షమునకు సరియైన పదము నుపయోగించాలంటే emancipation. అదే నిజమైన ముక్తి true freedom. దాన్ని పొందే నిమిత్తమై యిన్ని విధములైన పేర్లు పెట్టుకుంటున్నాం.

sri sathyasai vahini / vachanamrutam

మనము పొందవలసినది ఏమిటి? Freedom. ఏమిటి free అంటే. స్వేచ్ఛగా సంచరించటమనుకుంటున్నాం. Freedom అనగా బంధరహితుడై ఉండటమే. ఎలాంటి బంధన మనకు ఉండకూడదు. సర్వకర్మలు ఆచరించు కానీ దానితో attachment పెట్టుకోవద్దు. అదియే నిజమైన పాజిటివ్. కర్మలాచరించు. కానీ attachment పెట్టుకోవద్దు.

ఈనాడు నిజమైన attachment భగవంతుని ఆజ్ఞను శిరసావహించటమే. మానవుని నిజమైన కర్తవ్యముచేత సర్వకర్మలు ఆచరిస్తున్నారు. Attachment లేకుండా ఏ చిన్నపని చేయటానికి పూనుకోరు. ప్రతి విషయమునందు ఒక attachment దృష్టియందు ఉంచుకొనే దానిని ఆశిస్తుంటారు. చిన్న ఉదాహరణ చూడండి. నీవు పదవ తరగతి అయిన తరువాత ఏమి చేస్తావు అని అడిగితే నేను ఇంజనీరింగు చదవాలి కనుక గణితము దృష్టిలో పెట్టుకున్నాను అంటాడు. డాక్టరు కావాలి కాబట్టి బయోసైన్సు తీసుకున్నాను అంటాడు. అనగా తన భవిష్యత్తునంతా యినాడే నిర్ణయించుకొని బంధనకి గురై పోతున్నాడు. డాక్టరు చదువు, తప్పులేదు. బయోసైన్సు తీసుకొని డాక్టరుగా పాస్ అవు. కానీ డాక్టరుగా సర్వులకు సహాయకారిగా నిల్చు. అప్పుడు bondage కాదు. డాక్టరు చదవటములో తప్పులేదు. ఇక్కడ దోషమునకు, దోషరహితము నకు ఉన్న మర్మమింతే. Positive కు నెగిటివ్‌కు ఉండిన సంబంధమింతే. దేనిని వదలనక్కరలేదు. అన్నింటియందు నీవు ప్రవేశించు. కానీ మమత్వము లేకుండా జీవించు. దాని ఫలితమునకై నీవు జీవితమునంకితము చేయవద్దు. ఈవిధముగా తీసుకున్నప్పుడే పాజిటివ్‌గా తయారౌతుంది. సేవలు చేస్తున్నారు. సమాజసేవలు ఏవిధంగా చేస్తున్నారు. అక్కడ కూడా వాంఛలు దృష్టి యందుంచుకొనే సేవలు సల్పుతున్నారు. అది కూడా నెగిటివ్‌గానే రూపొందు తున్నాది. ఎక్కడ నెగిటివ్ వచ్చిందో అక్కడ ఏమాత్రం సంతోషము, సుఖము లభ్యము కాదు. నెగిటివ్ అప్పటికప్పుడు ఆనందము చేకూరుస్తుంది. గానీ శాశ్వతమైన ఆనందము నందించదు. అందుకోసమే శంకరులవారు చెప్పారు. 'మాకురు ధనజన యవ్వనగర్వం'. అప్పటికప్పుడు మాత్రమే ఆనందము చేకూరుస్తుంది గానీ శాశ్వతానందము అది అందించలేదు. శాశ్వతమైన దాన్ని పొందాలనుకుంటే అన్ని కర్మలు ఆచరించు కానీ దానితో ఏమాత్రము సంబంధము ఉండినట్లుగా భావించవద్దు. 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధకం.' శరీరము

sri sathyasai vachanamrutam

కర్మలాచరించుటకు వచ్చింది. కర్మను చేయి, తప్పులేదు. అది నెగిటివ్ కాదు. కానీ కర్మలయందు ఫలితముపై మనస్సు ఉంచినప్పుడే ఇది బంధన. అప్పుడే యిది నెగిటివ్‌గా రూపొందుతుంది. బంధం లేకుండా సర్వకర్మలు నీవు ఆచరించు. అదంతా పాజిటివ్‌గా తయారౌతుంది. భగవత్ కర్మగానే రూపొందుతుంది. దేవుడు అందించిన ఈ దేహాన్ని సత్కర్మలలో ప్రవేశింప చేసి, ఏ పని చేసినా దైవకార్యముగానే భావించాలి. ఈ కర్మ నిమిత్తము భగవంతుడు ఈ దేహాన్ని అందించాడు. మంచిగానీ చెడ్డగానీ భగవంతుని ఆజ్ఞ శిరసావహించటమే కర్తవ్యము. తన వ్యక్తిత్వము పక్కకు నెట్టి తన కర్తవ్యము నిర్వర్తించటమే నిజమైన పాజిటివ్. కానీ యీనాడు అట్లా కాదు. వ్యక్తిత్వమునకు ముందంజ వేస్తున్నాడు. కనుక సర్వదుఃఖములకు గురౌతున్నాడు. సర్వబంధనలకు గురౌతున్నాడు. సమస్త దుఃఖములచేత తాను కృంగిపోతున్నాడు. మానవుడు కృంగక, పొంగక ఉండే స్థితి నిజమైన కర్తవ్యము నిర్వర్తించటమే. వ్యక్తిత్వము ప్రక్కకు పెట్టు.

అనేక పర్యాయములు మీకు చెబుతుంటాను. పూర్వము నాగయ్య అనే సినిమా యాక్టరుండేవాడు. ఆయన త్యాగయ్య వేషము వేశాడు. త్యాగయ్య వేషము వేసి పాట పాడుతుంటే జనము ఆనందమును అనుభవించేవారు. కానీ త్యాగయ్య అనే పేరు నిలిచిపోయిందిగానీ నాగయ్య అనే పేరు నిర్మూలమై పోయింది. త్యాగయ్య ఎవరు వేశారని ప్రశ్నించినప్పుడు మాత్రమే నాగయ్య వేశాడు అని పేరు వస్తుంది. స్టేజిపైన నటన చేసే సమయంలో, పాడే సమయంలో త్యాగయ్యే గానీ నాగయ్య కాదు. భౌతికమైన జగత్తు అనేది ఒక నాటకరంగము. దీనిలో లోపల వ్యక్తిత్వమును ప్రక్కకు పెట్టాలి. జీవతత్త్వముపైన సరైన భద్రత నుంచుకోవాలి. జీవతత్త్వమే నిజమైన భద్రత. అదే పాజిటివ్. ఎక్కడ నెగిటివ్ అనే బంధన వస్తుందో అక్కడ బంధనమవుతుంది. నేను నేను అని మమత్వము పెంచుకోవడమే పెద్ద బందన. ఏమిటి నేను. ఏది నీవు? మనసా నీవు, బుద్ధా నీవు, అంతఃకరణా నీవు. ఈవిధంగా ప్రశ్నవేసుకున్నప్పుడు ఏదీ నీవు కాదు. ఇంక నీవు ఎవరు? 'నేను నేనే' అదే నిజమైన పాజిటివ్. I am doctor, I am engineer, I am lecturer. అలాంటివన్నీ తాత్కాలికంగా వచ్చేవి. ఈ వ్యక్తిత్వమును ప్రక్కన పెట్టాలి. విద్యార్థులు ఈనాటి నుండే ప్రయత్నము చేయాలి. చిన్న వయస్సునందే ముక్తి ముక్తి అని ముక్తిని ఎందుకు

sri sathyasai vachanamrutam

బోధిస్తున్నారు అని తల్లిదండ్రులు కొంతవరకు బాధపడవచ్చు. ముక్తి అంటే చచ్చిపోయిన తరువాత కలిగే మార్పు కాదు. బ్రతికినప్పుడే ఈ Liberation యొక్క స్థానం మనం అనుభవించాలి. ఏమిటి ఈ లిబరేషన్. విముక్తియే లిబరేషను. విముక్తి పూర్తి అయిన తరువాతనే ముక్తి. Liberation కి మొట్టమొదట freedom. Freedom మొట్టమొదటిది, విముక్తి రెండవది. ముక్తి మూడవది. దీనికి చక్కని ఉదాహరణము. మొట్టమొదట నీవు విద్యార్థిగా ఉండు. చదువు. తరువాత ఉద్యోగములో ప్రవేశించు. నీకు అప్పుడు జీతము వస్తుంది. అప్పుడు నీవు ఉద్యోగస్థుడవు. ఉద్యోగము అయిన తర్వాత రిటైర్ అయిపోతావు. రిటైరు అయిన తరువాత pension వస్తుంది. ఉద్యోగము చేసే సమయంలో pension యివ్వరు. చదివే సమయంలో ఉద్యోగం యివ్వరు. మొట్టమొదట మనం చదవాలి. విద్యార్థిగా తయారుకావాలి. విద్యార్థి అయిన తరువాత ఉద్యోగములో ప్రవేశించాలి. ఉద్యోగము సక్రమముగా చేసిన తర్వాతనే నీకు రిటైర్మెంటు వస్తుంది. అప్పుడు pension నీకు అందిస్తారు. అదేరీతిగా freedom విద్యార్థి దశ వంటిది. Liberation ఉద్యోగము వంటిది. విముక్తి రిటైర్ అయిన తర్వాత స్థితి. అప్పుడు అనుగ్రహమనే pension వస్తుంది. నీవు ఆఫీసుకు పోనక్కరలేదు. యింట్లో కూర్చో pension వస్తుంది. ఆ pension భగవంతుడిచ్చే అనుగ్రహము.

భగవంతుని దృష్టిలో నాలుగు విధములైన ముక్తులుంటున్నాయి. సాలోక్యము, సామీప్యము, సారూప్యం, సాయుజ్యం అని నాలుగు. మొట్టమొదటిది సాలోక్యం. అనగా చిన్న వయస్సునందే మొట్టమొదట ఆ లోకములో ప్రవేశించాలి. సా-లోక్యం. ఏ లోకములో ఉన్నావురా అంటే చదువు లోకంలో ఉన్నాను, పెండ్లి లోకములో ఉన్నాను అంటారు. దైవలోకంలో ఉన్నాను అనునది సాలోక్యం, అదే నిజమైన లోకం. దైవతత్వములోపల నా మనస్సు లీనమై ఉంది. తరువాత సామీప్యం అనగా మనస్సుకు అత్యంత సమీపములో కూర్చున్నాను. మూడవది ఆ రూపమే నేనైపోయినాను, అదే సారూప్యం. అదియే "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి." ఏది చింతన చేసానో దాని రూపము పొందినాను. నాల్గవది సాయుజ్యం. లీనమైపోయాను. అది లిబరేషన్ అన్నారు. చేరిపోయినాడు. వీటిని యీనాటి నుండే ప్రయత్నపూర్వకంగా సాధిస్తూ రావాలి. చిన్న చిన్న క్లాసులందు నెగిటివ్‌లో మనం

sri sathyasai vachanamrutam

ప్రవేశించకూడదు. ఏ పనిచేసినా దాని పాజిటివ్ లక్షణములు మనం తీసుకోవాలి. అనగా పుస్తకము చదువుతున్నాను. ఏ పుస్తకం చదువుతున్నావు? నా text book చదువుతున్నాను. ఎందుకోసమని? నేను పరీక్షలో ఉత్తీర్ణుడయ్యేకోసమని. యిది కూడా ఒక పాజిటివ్‌నే. ఇది భగవంతుడిచ్చే పరీక్షలు. ఈ పరీక్షలలో నేను ఉత్తీర్ణుడను అవ్వాలి అని ఆ భగవద్భావము నీవు తలచుకో. కానీ స్కూలులో పాసయ్యే నిమిత్తము చదువుతున్నాను అని స్కూలుకు నీకు సంబంధము పెట్టుకోకు. ఏది నీ స్కూలు. సత్సంగమే నీ స్కూలు. దానిలో యిది ఒక test గా ఉంటుంది. ఈ test లో నీవు పాసుకావాలి. ఈ test లో పాసైనప్పుడే సామీప్యం ప్రవేశిస్తుంది. దేనికి సామీప్యము. దైవత్వమునకు సామీప్యంలో ప్రవేశిస్తుంది. ఈ సామీప్యమునుండి క్రమక్రమేణా సారూప్యంగా తయారౌతుంది. Narrow mind అంతా పోతుంది. నెగిటివ్ thoughts అంతా పోతాయి. చిన్న ఉదాహరణ. మీరే యోచన చేయండి. పెద్ద కుంభవర్షము కురిసింది. గ్రామము చుట్టూ ఎక్కడ చూచినా నీరు ఉన్నాది. మాట్లాడుతున్నప్పుడు ఏమి చెబుతున్నావు పెద్ద కుంభవర్షము కురిసింది. ఊరు చుట్టూ సముద్రము వలే ఉన్నాది అంటావు. సముద్రము వలే ఉన్నాది. ఎక్కడ చూచినా నీరు అని. అదియే సామీప్యం. అంతా కూడా దైవత్వముగానే రూపొందుతున్నాది అప్పా. నేను ఏమి చెప్పినా, ఏమి చేసినా, ఏమి తలచినా, ఏది యిచ్చినా, ఏది పుచ్చుకున్నా అంతా దైవత్వముగానే ఉంటుంది. అదియే నిజమైన సాయుజ్యము. క్రమక్రమేణా చేసే ప్రతికార్యము దైవకార్యముగానే విశ్వసించాలి.

చిన్న ఉదాహరణ. మీరు M.B.A. పాస్ అయ్యారు. MBA దేనికోసం? చక్కని ఉద్యోగము బ్యాంకులోనో, ఫ్యాక్టరీలోనే వస్తుందని భావిస్తున్నారు. అలాంటి దానిని పొందాలనుకుంటే మొట్టమొదట నుండి ప్లాను వేసి అందులో చేరాలి. ప్రతిదానికి ప్లానులేకుండా పోవటానికి వీలు లేదు. మొట్టమొదట master plan వేయాలి. జీవితము వచ్చేసింది. ఈ జీవితము సార్థకము చేసుకోవాలి. ఏవిధంగా దీనిని సార్థకం చేసుకోవాలి. పాజిటివ్ కర్మలచేతనే సార్థకం చేసుకోవాలి. నెగిటివ్ కర్మలచేత ఏనాటికి సార్థకం కాదు. ప్రాచీన కాలము నుండి భారతదేశమే కాక అన్ని దేశములవారు మొట్టమొదట జీవితములో జీవించే విధానము గుర్తిస్తారు. మీ పిల్లవాడు ఏమిచేస్తున్నాడమ్మా అని ఎవరైనా

sri sathyasai vahini

ప్రశ్నించినప్పుడు మా పిల్లవాడిని బాగా చదివిస్తున్నాం. M.B.A. పాస్ చేసిన తరువాత పెద్ద ఉద్యోగస్థుడౌతాడు. పెద్దయింటివారి బిడ్డను పెండ్లి చేసుకుంటాడు అని యీవిధంగా ఎన్నెన్నో ప్లానులు వేస్తుంటారు. ఇలాంటి ప్లానులన్నీ నెగిటివ్ ప్లానులే. దేనికోసం చదివాడు. ఉద్యోగం కోసం. ఉద్యోగం దేనికోసం, పెద్ద జీతం తీసుకోటంకోసం. జీతం ఎందుకోసమని? ఒంటరివానికి జీతం ఎందుకు? కాబట్టి వానికి ఒక బంధన ఏర్పరచాలి. వారికున్న బంధనే కాకుండా దీనికి బంధన ఏర్పరచాలి. దీనికే ఆనాడు బుద్ధుడు చెప్పాడు నా బంధువులు, నా తల్లిదండ్రులు, నా మిత్రులు సర్వులు చేరి నాకు ఒక బంధన కట్టి నన్ను యీ పాపంలో ముంచి పెట్టారు అన్నాడు. ఆ బంధవిమోచన కోసమే నేను యీనాడు ప్రాకులాడుతున్నాను. ఏమిటి నీ బంధన ఎవరు చేశారు. తండ్రియైన శుద్ధోదనుడు. పండితులు నీ కుమారుడు గొప్ప యోగిగా తయారౌతాడని చెప్పారని, యోగిగా కాకుండా ఉండే నిమిత్తమై అనేక రకములైన కల్పనలంతా కల్పించి తన భార్య తమ్ముడైన వాని బిడ్డను యిచ్చి పెండ్లి చేశాడు. దేనికోసం చేశాడు. పెండ్లిచేస్తే ఒకవిధమైన మార్గములో ఉంటాడు. వైరాగ్యములో ప్రవేశించడు. కాబట్టి వైరాగ్యము రాకుండా ఉండే కోసము బంధన ఏర్పరచాడు. బంధన దేనికోసమని. వైరాగ్యము రాకుండా ఉండేకోసమని. బంధన ఏర్పడిన తరువాత స్వామీ నాకు బంధవిమోచన చేయండి అంటారు. కట్టుకొని విమోచన ఏవిధంగా చేయటము? మానవత్వములో ప్రతిదీ ఒక బంధనగా ఏర్పడుతున్నది. తల్లిదండ్రులను ఎవరినైనా అడగండి మీరు. ఎందుకయ్యా మీరు విచారిస్తున్నారు. అయ్యో మా కుమారునికి పెండ్లిచేయాలి. అదొక పెద్ద responsibility గా ఉంది. మాకీ బంధన తీరిపోవాలి అంటారు. పోనీ నీవు పెండ్లి చేసుకున్నావు కదా. నీవు బంధవిముక్తుడుగా ఉన్నావా? నీవు శాంతి, సంతోషాలు అనుభవిస్తున్నావా? అని ఎవరైనా ప్రశ్న వేస్తే యీ సంసారము నాకు వద్దు అంటాడు. తాను నాకీ సంసారము అక్కరలేదంటాడు. పిల్లలకు కట్టటానికి ముందంజ వేస్తాడు. యిది ఎంత ద్రోహము మీరు యోచన చేసుకోండి. తనకు చెడ్డ, కుమారునకు మంచి అవుతుందా? తనకు చెడ్డ అయితే కుమారునికి కూడా చెడ్డయే. తనకు మంచి అయితే కుమారునికి కూడా మంచియే. కనుక ఈ రకమైన లోకసంబంధమైన బాధ్యతలు పెరిగిపోతూ వస్తున్నాయి. బంధన అనేది పెండ్లి చేసుకోటమనిగానీ,

sri sathyasai vahini

సంసారము పెట్టడంగానీ, భవనం నిర్మించుకోటంగానీ, ఉద్యోగం చేయటం యివన్నీ కాదు బంధన. దానిపై attachment ను, మమత్వమును పెంచుకోటమే బంధన. తిరగాడు బుద్ధుడు. భార్య, కుమారుని వదలిపెట్టాడు. తిరిగి తిరిగి కట్టకడపటికి ఏ మహనీయుడు నా హృదయానికి సంబంధించిన సత్యాన్ని బోధిస్తాడా అని విచారము చేస్తూ వచ్చాడు. కానీ వారు చెప్పేది ఒకటి, చేసేది మరొకటిగా కనిపించింది. వీటివల్ల మోక్షము కలగదు. అన్నింటిని వదలి నదీతీరం చేరుకున్నాడు. ఒక వటవృక్షం క్రింద కూర్చున్నాడు. ఏది నిజము ఏది కాదు అని యీవిధంగా విచారిస్తూ వచ్చాడు. కట్టకడపటికి గుర్తించాడు "సర్వం దుఃఖం దుఃఖం" అన్నాడు. "సర్వం అనిత్యం అనిత్యం" అన్నాడు. "సర్వం శూన్యం శూన్యం" అన్నాడు. అన్నీ కనిపిస్తున్నా, యిదంతా కేవలం శూన్యం. కానీ విచారణ చేస్తే యివేమి కనిపించవు. ఇవి సత్యాలు కాదు. కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవు కదా! కలలో ఉండినంత వరకు అన్నీ సత్యముగానే కనిపిస్తున్నాయి. కలలో పాము కరచింది. కలలో ఏడుస్తున్నాడు. ఏడుపు ఎప్పుడు నిల్చిపోవాలి. నిద్రనుండి లేపినప్పుడు ఏడుపు automatic గా నిల్చిపోతుంది. నిద్రనుండి లేపాలి. ఈ ప్రపంచమనే జీవితములోపల మీరు నిద్రిస్తున్నారు. ఈ నిద్రలో సర్వానుభూతులు క్షేమంగా ఉండినట్లుగా, మధురంగా ఉండినట్లుగా అనుభవిస్తున్నారు. కానీ యిక్కడ కొన్ని కష్టాలు కూడా ప్రారంభమైనాయి. ఈ కష్టాలకు నీవు యోచన చేస్తున్నావు, విచారణ చేస్తున్నావు. ఎప్పుడు విమోచన అవుతుంది. నిద్రనుండి లేచినప్పుడు యిదంతా అనిత్యం, శూన్యము అని సరైన ఆదర్శము నిరూపించినప్పుడే యీ నిద్రనుండి మేల్కొంటారు. ఈ చిన్నవయస్సునుండి start early, drive slowly, reach safely. యీ విముక్తికి తగిన ప్రయత్నం చేయాలి. ఏ బంధన లేకపోయినా ఆకలి నిన్ను బాధపెడుతున్నది కదా. ఆకలి నుండి నన్ను విముక్తి చేయాలి. ఆకలి కూడా ఒక బంధనే. డబ్బు కావాలి. దరిద్రుడుగా ఉన్నావు. కాబట్టి యీ దరిద్రముకూడా ఒక బంధనే. దరిద్రముపోతే గానీ నీకు క్షేమం కల్గదు. అది కావాలి, యిది కావాలి అని పెద్ద అజ్ఞానములో మునిగావు. అజ్ఞానము కూడా ఒక బంధనే. ఈ అజ్ఞానము నుండి నన్ను దూరము చేయి. ఈ రోగము నుండి నన్ను దూరము చేయి. ఈ ఆకలినుండి నన్ను దూరము చేయి. దరిద్రమునుండి నన్ను దూరము

sri sathyasai vachanamrutam

చేయి. ఇవన్నీ బంధనలే. బంధన ఉండినంతవరకు ఆనందము చిక్కదు. బంధ విమోచన అయినప్పుడే ఆనందము ప్రాప్తిస్తుంది. రోగము ఉండినంత వరకు దుఃఖము పీడిస్తుంది. రోగము నివారణ అయినప్పుడు ఆనందము కలుగుతుంది. నివారణ నిమిత్తము చేసేవన్నీ ముక్తులే. సాధనలు చేస్తున్నాము. ఏమిటి కారణము. సాధన అంటే చెడ్డను వదలి మంచిని పట్టుకోవటమే సాధన. దుఃఖమును వదలి ఆనందమును అందుకోవటమే సాధన. చీకటినుండి వెలుగుకు చేరుకోవటమే సాధన. దీనినే ఉపనిషత్తులందు అన్నారు "అసత్యములో ఉన్నంతవరకు సత్యము చిక్కదు. సత్యములో పోతినా అసత్యమును లెక్కచేయవు". దేనిని లెక్కచేయకుండా పోతుందో దానినే గురువుగా తీసుకోవాలి. సత్యము మనకు తెలుస్తే అసత్యమును ఏమాత్రం లక్ష్యం చేయము. కనుక సత్యం నాకు కావాలి. అదే 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియం' దీనికి ఒక చిన్న ఉదాహరణ ఉన్నాది. ఒకానొక సమయంలో కపిలదేశమహరాజు పండింతులనందరిని పిలచి ప్రశ్నిస్తూ వచ్చాడు. ఒక్కొక్కరు ఒక్కొక్క జవాబు చెబుతూ పోయారు. కానీ మహారాజుకు తృప్తి కల్గలేదు. కానీ కపిలదేశ మహారాజు తన స్వంతదేశ పండితునే మరొకడిని పిల్చాడు. రాజుకు అర్థం కావడం లేదు. నీవు దీనికి సరైన జవాబు చెప్పగలవా అని ప్రశ్నించాడు. నేను చెప్పగలనో లేదో ధైర్యము లేదు అన్నాడు పండితుడు. యితన్ని వెనక్కి పంపించాడు. వచ్చిన పండితులను అడగటము, వారిని వెనక్కి పంపటము ఈరకంగా జరుగుతూ వచ్చింది. పండితులంటే పెద్ద గ్రంథాలు చదివిన వారు, వేదశాస్త్ర యితిహాస పురాణాలు చదివినవారు, అర్థాలు బోధించేవారు వీరు కాదు పండితులు. రాజు చేస్తున్న మూర్ఖపు చేష్టలు ఒక గొల్లవాడు తెలుసుకున్నాడు. పెద్ద కంబళి భుజముపై వేసుకొని మహారాజు దగ్గరకు పోయాడు. ఎందుకురా నీవు వచ్చావు అన్నాడు. మహారాజా! మీరు ప్రశ్నలు అడుగుతున్నారట. ప్రతి ఒక్కరు దోవలో పోయేవారు మిమ్మల్ని విమర్శిస్తూ పోతున్నారు. నేను జవాబు చెప్పగలను అన్నాడు. చెప్పగలవా? చెప్పగలను అన్నాడు. చెప్పకపోతే నీ తల తీస్తాను అన్నాడు. తలకాదు ఏమైనా తీసుకో నేను చెప్పగలను అన్నాడు గొల్లవాడు. ధైర్యంగా వాడు ఎదుర్కొన్నాడు. కూర్చున్నాడు. రాజు ప్రశ్న అడిగాడు. "మహారాజా మీరు అడిగేవారు. జవాబు చెప్పేవాడను నేను. జవాబు చెప్పేవాడు పెద్దవాడు.



sri sathyasaivachanamrutam

ప్రశ్న అడిగేవాడు చిన్నవాడు. కాబట్టి నీవు తెలుసుకోవాలని ప్రశ్న అడుగుతున్నావు. నీవు చిన్నవాడు. దానికి జవాబు చెప్పేవాడిని నేను పెద్దవాడను. మీ డ్రస్సు నాకివ్వండి. నా డ్రస్సు మీరు వేసుకోండి. మీ సింహాసనముపై నేను కూర్చుంటాను. నా వలె క్రింద కూర్చుని ప్రశ్న వేయండి అన్నాడు గొల్లవాడు. సరే అన్నారు. మహారాజు డ్రస్సు గొల్లవానికి వేశారు. సింహాసనంపై కూర్చోబెట్టారు. మహారాజు క్రింద కూర్చున్నాడు. సింహాసనంపై కూర్చున్న గొల్లవాడు అడుగుతున్నాడు. 'మహారాజా! నీ ప్రశ్న అడుగు' అన్నాడు. మహారాజు ప్రశ్నించాడు. 'భగవంతుడు జగత్తులో చేసే పని ఏమిటి?' చక్కని జవాబు యిచ్చాడు గొల్లవాడు. 'కూటిపేదను కోటీశ్వరునిగా చేస్తాడు. కోటీశ్వరుని కూటిపేదగా చేస్తాడు. ఇంతవరకు నేను కూటిపేదగా ఉన్నాను. ఇప్పుడు రాజుగా ఉన్నాను. కూటి పెదగా నీవు కంబళి భుజముపై వేసుకొని కూర్చున్నావు. ఇదే భగవంతుడు చేసే పని'. అనగా rich ని poor గా, poor ని rich గా చేస్తాడు. సరే అది కొంతవరకు మనస్సుకు తట్టింది. రెండవ ప్రశ్న 'భగవంతుడు ఎవరిని చూస్తాడు. ఎవరిపై అనుగ్రహ దృష్టి కల్గుతుంది'. ఒక దీపము చూపించాడు. మహారాజా ఈ దీపము వెలుగుతున్నది. ఇది ఎటువైపు చూస్తున్నదని గమనిస్తే అన్నివైపులా చూస్తున్నది. కనుక జ్యోతి స్వరూపుడైన భగవంతుడు అన్ని దిక్కులు చూస్తుంటాడు. కానీ ఒకవైపున మాత్రమే చూడడు. ఇది మహారాజుకు తృప్తి కల్గింది. ఇంక మూడవది వేశాడు. మూడవ ప్రశ్నకు కొంత సందేహించాడు గొల్లవాడు. రాజు ఎలాంటి ప్రశ్న వేస్తాడో ఏమిటో అనుకున్నాడు. రాజు అడిగాడు 'స్వామీ' అని గొప్ప మర్యాదతో గొల్లవానితో 'స్వామీ! నేను మూడవ ప్రశ్న అడగదల్చుకున్నాను' అన్నాడు. 'భగవంతుడు ఎక్కడ ఉంటాడు?' ఒక కప్పులో పాలు తీసుకువచ్చాడు. ఆ పాలలో వెన్న ఎక్కడ ఉంటుందో చెప్పగలవా అన్నాడు గొల్లవాడు రాజుతో. ఆ పాలలో ప్రతి కణమున, అణువున వెన్న ఉంటున్నాది' అన్నాడు రాజు. కాబట్టి భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు అన్నాడు గొల్లవాడు. అయితే నాకు కనిపించాలి కదా. కనిపించాలంటే పాలను ఏమి చేయాలి? పాలను కాచాలి. కాచి తోడంటు వేసి పెరుగు చేయాలి. పెరుగును చిలకాలి. చిలికే సమయంలో వెన్నపైకి వస్తుంది. అదేవిధముగా భగవంతుడు సర్వత్రా ఉండిననూ వానిని హృదయములో ప్రతిష్ఠించుకొని, భక్తి ప్రపత్తులతో వేడిచేసి, దివ్యత్వమనే తోడంటు వేసి



sri sathyasai vahini.in

సాధనతో చిలికినప్పుడే సాక్షాత్కారమనే వెన్న వస్తుంది. తృప్తిపడ్డాడు మహారాజు. అప్పుడు యితనికి రాజ్యమును సగభాగము యిచ్చి నిత్యజీవితములో యిలాంటి పవిత్రమైన వాటికి జవాబు చెప్పేవాడే నిజమైన పండితుడు. పామరుడైనా చాలా గొప్పవాడవు అన్నాడు. పాండిత్యము ఉండుటలో కాదు గొప్పతనము. తెలివి తేటలలో విశ్వాసముతో జవాబు చెప్పటమే నిజమైన గొప్పతనము.

## ప్రతిఫలాపేక్ష లేని సేవయే నిజమైన సేవ

ఈనాడు పాజిటివ్, నెగిటివ్ అంటే ఏమిటి అని ఎంత చదువుకున్న వానికైనా అర్థము కావటం లేదు. అనగా మనస్సున ప్రవేశించినదంతా నెగిటివ్‌నే. ఏ దానిని చూచి మనస్సు వెనక్కు తిరుగుతుందో అదే పాజిటివ్. మనస్సు ఆకర్షించేదంతా నెగిటివ్. అయితే ఆ నెగిటివ్ ఆకర్షించినప్పుడు కూడా దానిలో ప్రతిఫలము లేకుండా ప్రవేశించు, తప్పకుండా అది కూడా పాజిటివ్ అవుతుంది. నీవు డాక్టరు. ఆ పేషెంటును చూడాలి. ఒక ఫలితముతో నీవు చూడటం లేదు. ఆ పేషంటు బాధ నివారణ కావాలి అనే ఉద్దేశ్యముతో నీవు చూడు. అది పాజిటివ్ అవుతుంది. కాబట్టి డాక్టరుగా పొసికా, మందులు యిచ్చుకో ఏమి చేసినా positive గా తయారుకావాలంటే ప్రతిఫలాపేక్ష లేకుండా చూచుకోవాలి. ప్రతిఫలము కోసము ప్రాకులాడుతున్నప్పుడు నెగిటివ్‌గానే రూపొందుతుంది. Result కోసం నీవు ఏమాత్రం wait చేయకు. నీ result ఏమిటి? బాధపడేవారి బాధ నివారణ కావటమే. అదే positive గా తయారౌతుంది. ప్రపంచములో చిన్న విద్యార్థి మొదలుకొని పెద్ద పండితుని వరకు నిత్యజీవితములో చేయవలసిన కర్తవ్యము నిర్వర్తించటమే నిజమైన పాజిటివ్. వ్యక్తిత్వమును దూరం చేయాలి. నీయొక్క దివ్యత్వమును ప్రకాశింప చేసుకోవాలి. ఈనాటి మానవుడు మానవునియందున్న మానవత్వమునే గుర్తించుకోలేక పోతున్నాడు. ఇంక మానవత్వమునందున్న దైవత్వమును ఏరీతిగా గుర్తించగలడు. తనయందున్న మానవత్వమునే తెలుసుకోలేనివాడు తనయందున్న దైవత్వమును ఏరీతిగా తెలుసుకోగలడు. మొట్టమొదట నీయందున్న human quality నీవు గుర్తించుకో. అప్పుడు divine quality తప్పక తెలుస్తుంది. ఈనాడు నెగిటివ nature తో ఉంటున్నారు. పాజిటివ్

sri sathyasai vachanamrutam

nature గా రావాలి. అది మన nature గా ఉండాలి. Nature అంటే ఏమిటి? నిత్యజీవితములో కనిపించేదంతా నేచరే (ప్రకృతే). కానీ యిది పాజిటివ్ నేచరుగా నీవు చూడు. సర్వం విష్ణుమయం జగత్‌గా రూపొందుతుంది. కనుక నీవు కర్మలు విడిచిపెట్టనక్కర లేదు. స్వంత పని చేసుకో, అన్ని పనులు చేసుకో, ఏ పనియందు దోషము లేదు కానీ మంచి భావముతో చేయి. పవిత్రమైన హృదయముతో నీవు చేయి. హృదయము పవిత్రముగా పెట్టుకున్నప్పుడు అన్నీ పవిత్రముగానే జరుగుతుంటాయి. మనసు బుద్ధి చిత్తము అహంకారము నాల్గింటియందు మనస్సు ఒక్కటే ఉండేది. మనస్సు వాంఛలతో లేకుండా చేసుకున్నప్పుడు అన్నీ పాజిటివ్‌గానే రూపొందుతాయి.

నిజంగా మీరు నమ్ముతారో నమ్మరో కానీ, కొంతమంది నమ్మవచ్చు, నమ్మకపోవచ్చు. నా దేహము ఉంది. నా మనస్సు ఉంది. నా బుద్ధి ఉంది. నా అంతఃకరణ ఉంటున్నాది అన్నీ ఉన్నాయి. మీవలె నాకు ఉన్నాయి. కానీ నేను వాటిని touch చేయటం లేదు. మనస్సు ఉండి ఆ మనస్సు monkey mind అని తెలుసు. దానియొక్క ప్రభావమునకు నేను ఏమాత్రం చిక్కుకోను. అది దాని సహజము. వస్తుంది పోతుంది. దానికోసం నేను చిక్కుకోనక్కర లేదు. మైండ్ ఒక passing cloud, monkey mind. Body is water bubble. I don't want body. I don't want mind. I want only +ve is conscience. నా దేహము ఉంటున్నాది. నా దేహము స్పర్శ అనేదానిలో ఎంతో పాజిటివ్ ఉంటున్నాది. ఎక్కడైనా నా దేహము తాకండి. అక్కడంతా పాజిటివ్‌నే. నాకు negative thoughts రావు. అయితే కొంతమంది మనస్సు మార్చే నిమిత్తం యిట్లా చేయవద్దు, అట్లా చేయవద్దు అని అరుస్తుంటానేగానీ అది అరుపు కాదు. చక్క చేయటానికే. ఇంత ప్రపంచములో నాకు 72 సం॥లు అయినప్పటికి ఒక్క వాంఛ నాలో లేదు. ఏనాడు అది కావాలి అనే ఆశ కూడా లేదు. ఏ సమయములో అలాంటిది రాలేదు...... **మీరు అందరు యీ విషయంలో చాలా జాగ్రత్తగా చూచుకోవాలి. ఈ దేహము 95 సంవత్సరముల వరకు ఉంటుందన్నాను. నిజమే, అవసరమైతే 95 కాదు, 100 వరకు ఉంటాను. కానీ నాకు యిష్టము లేకుండాపోతే ఏ నిముషములోనైనా ఈ దేహాన్ని వదలవచ్చు. ఈ రెండుకూడా నా ఆధీనంలో ఉంటున్నవి. సాయిబాబా 95 అన్నాడే యిట్లపోయిందే, అట్లపోయిందే అనుకుంటే ప్రయోజనం ఉండదు. ఏ నిముషమైనా**

sri sathyasai vahamrutam

**పోవచ్చును. ఏ నిముషమైనా పెంచుకోవచ్చు. ఈ స్వతంత్రము నాకుంటున్నది....** నేను ఏ పని చేసినా పాజిటివ్ పనులే గానీ నెగిటివ్ పనులు ఒక్కటీ లేదు. ఆ దేహము touch చేసేటప్పుడు negative thoughts రావు. అంతా పాజిటివ్‌గానే ఉంటుంది.

ఈవిధంగా నేను చేసేది, చెప్పేది రెండూ ఒక్కటే. ఇప్పుడే కాదు. ఈ దేహమునకు 9వ సంవత్సరమునుంచి అన్నీ ఈవిధంగానే చేస్తున్నాను. ఈ గ్రామములోపల కరణం సుబ్బారావు అనేవాడు ఉండేవాడు. సుబ్బమ్మ భర్త. గ్రామములో అతనే land lord. యీ చుట్టూ ఉండే భూములన్నీ అతనివే. అతన్ని చూస్తే అందరు భయపడేవారు. కరణం పిలుస్తున్నాడంటే అదురుతూ పోయేవారు. నేను యిప్పుడే యింత ఎత్తు. అప్పుడు యింకా చిన్నగా ఉన్నాను. అతను చాలా చెడ్డ ప్రవర్తనలో ఉండేవాడు. ఆ పాటలంతా వ్రాసి, పిల్లలందరిని పిలిచి, పిల్లలతో పాడిస్తూ అతను బృందావనం ముందు కూర్చున్నప్పుడు అతని ముందుగా పాడుకుంటూ పొమ్మని చెప్పేవాడిని. స్వామీ ఆ కరణం కొడతాడో యేమిటో అన్నారు. నీ body ని touch చేయటానికి అతనికి అధికారం లేదు. నా పాటతో మీరు వెడుతున్నారు. Positive thoughts సత్యాన్ని బోధించే సమయంలో ఎవరు మనలను నిందించటానికి, బాధించటానికి అధికారము ఉండదు. బాగా పిల్లలకు నేర్పించాను. మంచి రాగము వేసి చక్కగా ప్రాక్టీసు చేసి చక్కగా పాడుకుంటూ పోతున్నారు. ఆ పిల్లలకు అర్థము తెలీదు పాపం. మొదటి దినము లేచి లోపలకు వెళ్లిపోయాడు కరణం. రెండవదినం అడ్డంగా నిల్చుని పిల్లలు పాడుతున్నారు. లోపలకు పోయి మామిడిపండు జ్యూస్ యిచ్చి యీ పాటలు మీరు పాడవద్దండి అన్నాడు. మీకు ఎవరు నేర్పించారని అడుగగా రాజు నేర్పించాడండీ అన్నారు. రాజు ఈ పనులంతా చేస్తున్నాడా అని ఒక దినము రాజుని టిఫిన్‌కి రమ్మని చెప్పాడు. నాకు టిఫిన్ అక్కరలేదు అన్నాను. చిన్నపిల్లవాడు యింత గట్టిగా మాట్లాడుతున్నాడే అని అతనికి చాలా కోపం కూడా వచ్చింది. నేను ఆనాటి పరిస్థితికి తగిన బుద్ధులే నేను నేర్పేది. పాట వ్రాసాను.

**భగవంతుడే నిజమైన స్నేహితుడు**

**వింటకత్తెల చెరకు పోకు ఖండితముగా నీవు కడు నీచుడౌతావు**

sri sathyasai vahini amrutam

**కలము వారలు నిన్ను కుండముట్టానివ్వరు**
**బంధువులు నిన్ను చూచి బయటెళ్ల గొడతారు**
**స్నేహితులు నిన్ను చూస్తూ చెప్పుతో కొడతారు.**

ఈవిధంగా పాడుతుంటే చాలా భయపడిపోయేవారు పిల్లలు. ఆనాటి పరిస్థితిలో యిలాంటి పదములే వారికి ఉపయోగపెట్టాలి. ఈవిధంగా చక్కచేసే నిమిత్తము కొన్ని వ్రాతల వల్ల, పాటల వల్ల, నాటకముల వల్ల జగత్తులో మార్పులు తెప్పిస్తూ వచ్చాను. ప్రతి ఒక్కటి నేను చేసి చూపించే స్వభావము. నేను చేయందే చెప్పను. నేను చేస్తాను. యిది మంచిదని చెబుతాను. కానీ ఏది చేసినా పాజిటివ్‌గానీ నెగిటివ్‌గాదు. నాకు ఏ వాంఛలు లేవు. పిల్లలందరును ప్రాపరిటీ అన్నాను. యిప్పుడు కూడా ఒక పిల్లవాడు స్వామి ప్రోపరిటీ అన్నాడు. నిజమే. అందరూ నా ప్రోపరిటీయే. కానీ ప్రోపరిటీలో విలువైనవి, విలువకాని ప్రోపరిటీలు కూడా ఉన్నాయి. కొన్ని భూములుంటాయి విలువైనవి. దానికి fence మాదిరి వేస్తాం. ఆ ముండ్ల fence నా ప్రోపరిటీయే. మంచి ఉన్నాది, చెడ్డా ఉన్నాది. అయితే విద్యార్థులు నా ప్రోపరిటీగా తయారు కావాలి. ముండ్ల ప్రోపరిటీలుగా తయారు కాకూడదు. బండల ప్రోపరిటీలుగా తయారుకాకూడదు. కొండల ప్రోపరిటీల వలే తయారుకావాలి. అలాంటివారుగా తయారుకావాలి. కనుక ఈ విద్యార్థులను పట్టి తగిన తర్ఫీదు యిస్తూ వస్తున్నాను.

కానీ చాలామంది విద్యార్థులు నా తత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. వారి స్థాయి అలాంటిది. వారి స్థితి అట్టిది. వారి స్థాయికి తగినట్లుగా అర్థమవుతూ ఉంటుంది. ఏనాటికైనా నా స్థాయికి వచ్చాక తప్పక గుర్తించుకుంటారు. కానీ ఒక్కటిమాత్రం మీరు గుర్తించాలి. నాలో కాలు మొదలు తలవెంట్రుక వరకు నెగిటివ్ thoughts లేవు. నెగిటివ్ desires లేవు. యింక దోషము ఎట్లా వస్తుంది. అంతా పాజిటివ్. అయితే పరులకు నేర్పే సమయంలో నెగిటివ్‌గా రూపొందింపచేస్తాను. ఈవిధంగా స్వామి యొక్క తత్వము చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ఎన్నో పర్యాయములు చెప్పాను. ఎక్కువ మాట్లాడకండి. Talk less - work more. కానీ ఎవరు అనుసరించటం లేదు. కొంతమంది పిల్లలు చెబుతారు. తల్లిదండ్రులు పెళ్లి చేసుకోమని చెబుతున్నారు. పెళ్లి



srisathyasaivachanamrutam

చేసుకోవద్దని నేను చెప్పను. మీకు యిష్టమైతే తప్పక చేసుకోండి. ఎవరిని వద్దని చెప్పను. అయితే యిష్టములేకుండా ఉంటే నేను force చేయను. పెండ్లి అనేది source గానీ force కాదు. కాబట్టి బలవంతముతో పెండ్లిండ్లు చేసుకోకూడదు. నీకు యిష్టమైతే తప్పక చేసుకో. స్వామి చెప్పలేదని స్వామిపైన వేస్తారు. ఈవిధంగా స్వామిపై వేయకూడదు. నీకు యిష్టమైతే చేసుకో. నేను వద్దని చెప్పను. తప్పక ఆశీర్వదిస్తాను. కానీ స్వామివల్ల పెండ్లి నిలచిపోయిందనే పేరు రాకూడదు. ఎవరు ఏ పని చేయవలసినప్పటికి చేసుకోవచ్చు. తప్పులేదు. కానీ మొట్టమొదట నీ conscience ను ప్రశ్నించుకో. Is it good or bad. Is it right or wrong. ఈ question వేసుకొని నీ conscience నుండి వచ్చిన జవాబును నీవు అనుసరించు. అదియే follow the master. ఎవరు నీ మాస్టర్? నీ conscience నీ master. నీ master ను నీవు follow చేసినప్పుడు face the devil, fight to the end, finish the game. రెండు నాలుకల పాముగా మనం తయారు చేయకూడదు. ఒకే మాటగా ఉండాలి. Two tongues గా ఉండేది poision snake. మనకున్నది ఒకే tongue. కనుక అన్నీ బంధనలకు గురైపోతున్నాము. బంధన నిన్ను ఎక్కడినుండి బాధపెడుతున్నాది. నీవు కోరుకున్నదే నీకు బంధన అయిపోతున్నాది. ప్రాకృతవిషయాలలో నీవు ప్రవేశిస్తున్నావు. ప్రాకృతమైన పనులు నీవు చేయి, తప్పులేదు. కానీ దానితో కర్తవ్యమును నిర్వర్తించి పనిచేయి. భార్య ఉన్నాది. ఆమెను సంతోషపెట్టు. పిల్లలుంటున్నారు. వారిని పోషించు. వారికి చదువు చెప్పించు. వారికి పెండ్లి చేయి. సరైన స్థితిలో పెట్టు. వీటన్నింటిని వద్దని చెప్పను. కానీ ఒక కర్తవ్యము నీపై ఉంటున్నాది. నీవు ఏది మంచిది కాదనుకుంటావో అది పిల్లలకు బోధించకు. ఈనాడు నీవు bad అంటున్నావు. పిల్లలకు bad నే బోధిస్తున్నావు. నీవు good అంటున్నావు, పిల్లలకు ఆ మంచిని బోధించడం లేదు. ఇది చాలా దోషము. ఇది మంచిది కాదు. ఇది ఎవరు చేశారు. ధృతరాష్ట్రుడు చేశాడు. ఒకానొక సమయంలో విదురుడు వెళ్ళాడు. తన కుమారులంతా మరణించిన తరువాత ధృతరాష్ట్రుడు చాలా బాధపడుతున్నాడు. ముందు ఎంత చెప్పినా కానీ ధృతరాష్ట్రుడు వినలేదు. 'అన్నా! ఈనాటికైనా నీ దోషము గుర్తించావా? ఒక్క చెడ్డవానిని దూరము చేసి ఉంటే 99 మంది పిల్లలు బాగుపడి ఉండేవారు. ఆనాడే చెప్పాను. దుర్మార్గుడైన కుమారుని దూరము

చేయమన్నాను. ఒక్క దుర్యోధనుని దూరము చేస్తే మిగిలిన వారు సుఖపడతారని అన్నాను. నీవు విన్నావా, వినలేదు. నేను ఎప్పుడు ధర్మమునే చెబుతున్నాను. ఈ రాజ్యమంతా పాండురాజుది. అతడు మరణించిన తరువాత ఆ పిల్లలు నీ దగ్గరకి వచ్చారు. అతని రాజ్యమును నీవు హస్తగతము చేసుకొని ఆ పిల్లలు నివసించటానికి ఒక గ్రామము కూడా యివ్వలేదు. ఆనాడే చెప్పాడు విదురుడు. 'నీవు నెమళ్లను, జింకలను విడచి పులులను, చిరుతలను పెంచుకుంటున్నావు. క్రూరమృగములను పెంచుకుంటున్నావు. ధర్మజుడు, అర్జునుడు, భీముడు, నకులుడు, సహదేవుడు యిలాంటి వారిని పెంచటం లేదు. నీకు తప్పక ప్రమాదం జరుగుతుంది. పుత్రవాత్సల్యం గొప్పగా చేసుకుంటున్నాడు. పుత్రవాత్సల్యము ఉండవచ్చు గానీ ధృతరాష్ట్ర పుత్రవాత్సల్యము ఉండకూడదు. ధృతరాష్ట్ర పుత్రవాత్సల్యము ఏమి చేసింది. రాజ్యమునే నాశనం చేసింది. నూరుమంది కుమారులను కోల్పోయినాడు. కనుక మంచిమాటలు చెప్పినప్పుడు చాలా వరకు యింపు కాదు.

**మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన**
**చెడ్డమాటలట్లు చెవికి జేర్చు**
**ఇట్టి మీరు నన్ను ఎరుగంగ నేర్తురా**
**ఎట్టి చదువులున్న ఏమి ఫలము?**

మంచి మాటలు విననప్పుడు ఏమి చదివి ఏమి ఉపయోగము. మంచి మాటలను తగిన రీతిగా పోషించుకోవాలి.

స్వామిని మీరు తెలుసుకున్నా, తెలుసుకోకపోయినా స్వామికి ఎట్టి వాంఛలు లేవు. ఎవరిని దేనిని అడగటం లేదు. నా చెయ్యి యిచ్చేదే కానీ పుచ్చుకునేది కాదు. ఒక్కదానికి మాత్రం చెయ్యి యిట్లా చూపుతాను. Love. Love. ఆ love ఎవరిది. అది నా ప్రాపరిటీయే. Love is God. Live in love. God thoughts చాలా పవిత్రమైనవి. యిలాంటి thoughts మీరు గుర్తించుకోలేక మీ thoughts compare చేసుకుంటూపోతారు. దానివల్ల నా thoughts కూడా మీకు చెడ్డవిగా కనిపిస్తుంటాయి. నాలో చెడ్డ ఏకోశములోనూ కనుపించదు. God breath is our life breath. ఈవిధంగా మీరు భావించినప్పుడే మీరు అన్ని విషయములందు క్షేమాన్ని పొందగలరు. మీరు ఎంత



sri sathyasai vahini

చెప్పినా వినకుండా కొంతమంది పిల్లలు పాడౌతుంటారు. పాడైనవారు బయటకు పోయి ఎన్నో అవస్థల పాలౌతున్నారు. ఉన్న మీరైనా మంచి మాట విని పవిత్రమైన మార్గములో ప్రవేశించి నెగిటివ్ thoughts రాకుండా చూచుకోండి. తల్లిదండ్రులను ఏమాత్రము బాధపెట్టకండి. మాతృ దేవోభవ, పితృదేవోభవ. వారిని ఏవిధంగా హింసించకూడదు. అయితే వారికి చక్కగా మీరు బోధించి మీ హృదయాన్ని విప్పి వారిని satisfy చేయటానికి ప్రయత్నించండి. Explain చేస్తే వారు కూడా అర్థం చేసుకుంటారు. వారు ఏమి చెప్పినా no అంటే అది మొండితనమవుతుంది. Father my mind is like this అని మంచిగా చెప్పు. తీయని మాటలతో చెప్పి వారిని మార్చండి. అతనిని నీవు సరైన మార్గానికి తెప్పించి తృప్తిపరచు. నీకు తల్లిదండ్రులే చాలా ముఖ్యము. అయితే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిధి దేవోభవ అని అనేకమంది దేవుళ్లున్నారు. ఆచరించి బోధించేవాడు ఆచార్యుడు. ఆచరించకుండా బోధిస్తే ఆచార్యుడు కాదు. కేవలం టీచరు.

ఒకానొక సమయంలో మీరా భర్తను విడిచిపెట్టవలసి వచ్చింది. ఎంతకాలమో భరించింది. కానీ అతని హింసను భరించుకోలేకపోయింది. జుట్టుపట్టి బయటకు లాగేశాడు. కృష్ణమందిరమునకు తాళం వేశాడు. నా మందిరములో ఉండటానికి వీలు లేదు బయటకు వెళ్లమన్నాడు. చాలా బాధ కల్గింది. 'అయ్యో! నా కృష్ణుని వదలిపెట్టి పోవటమా? అనుకుంది. అక్కడ కూడా నెగిటివ్ thoughts వచ్చాయి ఆమెకు. తక్షణమే పాజిటివ్ బయలుదేరింది. ఇది మహారాజు కట్టిన మందిరము. నా హృదయము ఎవరు కట్టినది కాదు. నా ప్రభువు కట్టినదే. హమారా దిల్ తుహ్మారా మందిర్ కృష్ణా. నా హృదయమే నీ మందిరము అనుకుంది. ఒక జాబు వ్రాసింది తులసిదాసుకు. తులసీదాసు ఆమె కాలము వాడే. ఏమని? మూడు ప్రశ్నలు వేసింది. ప్రభూజీ నాకు యిలాంటి పరిస్థితి ఏర్పడింది. భర్తను వదలిపోవటము స్త్రీకి సరైనది కాదు. పతియే దైవమనే భారతీయ సంస్కృతికి విరుద్ధముగా పోవలసివచ్చింది. ఈ విషయములో ఏమి చేయమంటారు అంది. ఆయన జవాబు వ్రాశాడు. అమ్మా మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, పతిదేవోభవ అని చెప్పారు. తల్లి నిమిత్తమై ఎంతో శ్రమపడ్డాడు భరతుడు. కానీ రాముని అరణ్యములకు పంపటము చేత ఆ కుమారుడు కూడా తల్లి మాటను ధిక్కరించాడు. దానిని జ్ఞాపకము

sri sathyasai vahamrutam

చేశాడు తులసిదాసు. ఇతరులకు అపకారము చేస్తే మనం భరించు కోవచ్చు, సహించుకోవచ్చును. భగవంతుని బాధిస్తే సహించుకోకూడదు అన్నాడు. దైవముకోసం ఏమి చేసినా తప్పుకాదు అన్నాడు. దైవమే నీకు కావలసినది. శ్రీరామచంద్రుని అడవికి పంపించినందులకు ధిక్కరించాడు తల్లిని. తప్పులేదు. పితృదేవోభవ. హిరణ్యకశిపుడు భగవంతుని నిరంతరము దూషిస్తూ వచ్చాడు. నారాయణ అనే నామము ఉచ్చరించకూడదు అని ప్రహ్లాదుడిని కట్టడించాడు. దైవ ద్వేషిగా ఉంటున్న తండ్రిని ధిక్కరించు, తప్పులేదు. ఇక గురువు. బలిచక్రవర్తికి శుక్రాచార్యుడు గురుడు. శుక్రాచార్యుడు వద్దు, వద్దు అని అడ్డు వచ్చాడు. అప్పుడు బలిచక్రవర్తి చెప్పాడు. 'పలికి బొంకుట కంటే పాపమున్నె'. దైవానికిని నేను యిస్తానని చెప్పినప్పుడు మానటానికి వీలులేదు. గురువు ఆజ్ఞను ధిక్కరిస్తానని గురువాజ్ఞ ధిక్కరించాడు. ఇలాంటివన్నీ దైవముపట్ల మాత్రమే మనం ప్రత్యేకంగా చూచుకోవాలి. దైవవిషయములో ఏది వచ్చినా పరవాలేదు. ఎదుర్కో. Life is a challange meet it. నీవు ఏమాత్రం భయపడనక్కరలేదు. ఇలాంటి విషయాలలో మన జీవితాన్ని ధైర్యంగా ముందుకు నెట్టుకొని పోవాలి. ఆ జాబు చూచింది మీరా. చలోరె మన్. బయలు దేరింది ద్వారకకు. ఇంతకంటే నాకు ఆనందము ఏమిటున్నాది. తప్పక సత్యమైన మాట దైవవిషయములో నేను ఏమాత్రము విచారించను. దైవముకోసం నా సర్వస్వము త్యాగము చేస్తాను. తప్పు కాదని భర్తను వదలి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిన తరువాత మహారాజు చాలా విచారించాడు. నేను చాలా తప్పు పని చేశాను అన్నాడు. తాను కూడా గుఱ్ఱముపై పరుగెత్తి వెళ్లాడు. ఆయన ద్వారం దగ్గరకు పోయేటప్పటికి ఆమె ప్రాణం విడిచింది. చూశాడు. ఆ సంబంధము అంతవరకే ఉంటుంది. దైవాన్ని చూచింది. ప్రాణం విడిచింది. తిరిగి పతి ముఖమే చూడలేదు. సత్యమైన మార్గములో విజయాన్నే సాధిస్తూ వచ్చారు గానీ అపజయాన్ని ఏనాడు అందుకోలేదు. దైవవిషయములో ఎలాంటి యిక్కట్లు వచ్చినా తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగాలి. నా వెంట ఉంటే నా తత్వము బాగా చక్కగా తెలుస్తుంది. కానీ నేను ఎవరిని వెంటపెట్టుకోను. ఎందుకంటే వారు సరిగా అర్థము చేసుకోలేరు. అయితే రాత్రి అక్కడ పండుకోక తప్పదు. పండుకుంటున్నారు. వారు యివన్నీ చూస్తున్నారు పాపం. ఏమీ నాతో చెప్పటం లేదు. చెప్పినట్లు చేస్తున్నారు. పో అంటే

srisathyasaivachanamrutam

పోతున్నారు. తిరిగి రా అంటే వస్తున్నారు. భయపడిపోతూంటారు పాపం. చాలా మంచి పిల్లలు. స్వామి తత్వము ఏమిటో అర్థము చేసుకోలేకుండా పోతుంటారు. నేనే వారికి చెబుతుంటాను "నాయనా! యిట్లా ఉంటుంది. నేను ఎప్పుడు నెగిటివ్ thoughts లో ఉండను. పాజిటివ్‌లో పోతుంటాను" అని చెప్పాను. పూర్వము రాముడు అరణ్యవాసములో ఉంటుండి ఏమి చేశాడో తెలుసునా పాజిటివ్‌ను ప్రదర్శింపచేశాడు. అంతా పాజిటివ్‌నే. లక్ష్మణునకు తెలుసు. కనుకనే తాను adjust చేసుకుంటూ వచ్చాడు. సీతకు తెలుసు. ఆమె కూడా adjust చేసుకుంటూ వచ్చింది. దైవాన్ని అర్థము చేసుకునే వ్యక్తులు చాలా తక్కువమందే ఉంటారు. ఏది చెప్పినా మీ మంచికోసం నేను చెబుతున్నాను. ఏది చేసినా మీ మంచికోసం చేస్తున్నాను. ఆ సత్యము మొట్టమొదట గుర్తించుకోండి. ఏదీ మీరు నాకు యివ్వనక్కరలేదు. మీ కోసం ఏది కావలసినా నేను యిస్తాను. జీవితమును నిముషములో మీకు యిస్తాను. కానీ మీనుండి ఏమీ నేను కోరను. ఆ సత్యాన్ని మీరు గుర్తించి మీరు మంచిగా ఉండండి. దేశానికి ఆదర్శము నందించండి. ఫలాన కాలేజి పిల్లలంటే చక్కని ఆదర్శమునందించాలి. ఆవిధంగా మీరు ప్రవర్తిస్తారనే ఉద్దేశ్యంతో birthday అని యింత కప్పులో బియ్యం తీసుకు వస్తుంటారు. అక్షింతలు తెస్తారు. వాటితో స్వామి ఆశీర్వాదము చేయాలని. సరిగా తెలుసుకోండి. హయ్యర్ సెకండరీ పిల్లలు గానీ, కాలేజీ పిల్లలు గానీ చక్కగా గుర్తుంచుకోండి. నా ఆశీర్వాదమునకు అక్షింతలు అక్కరలేదు. చాలామంది అన్నము లేక అల్లాడిపోతుంటే అక్షింతలకు యింత బియ్యము waste చేయటమెందుకు. Waste చేయకూడదు. ఏదీ waste చేయకూడదు. ఏ పదార్థము waste చేయకూడదు. నాకు, మీకు మనస్సుతో కలసిన సంబంధమే గానీ యీ విధమైన ప్రాకృతమైనది కాదు. నెగిటివ్, పాజిటివ్ అనేదాన్ని చక్కగా అర్థం చేసుకోండి. నెగిటివ్ thoughts దూరం చేసుకోండి. Positive హృదయానికి హృదయమే సాక్షి. ఆ విధమైన సంబంధము పెంచుకుంటూ రండి. అప్పుడు నేను మీరే, మీరు నేనే అవుతాము. I am you and you are mine. ఈవిధంగా మనం మారిపోవచ్చును. చాలా గొప్ప పని. మీరందరు కొన్ని ప్రాకృతమైన విషయాల లోపల, తల్లిదండ్రులు చెప్పినా లేక బంధుమిత్రులు చెప్పినప్పటికిని నెగిటివ్ విషయములో మీరు విచారము చేసుకొని నిర్ణయించుకోండి. ఏది నెగిటివ్ అంటే

sri sathyasai vahini amrutam

మనస్సు ప్రేరేపించేది నెగిటివ్. Desires అన్నీ నెగిటివ్. కానీ divine desires నెగిటివ్ కాదు. Positive. ఎట్లాంటే divine చాలా పెద్దది. దాని కొలత యింత అని చెప్పలేము. దాని పరిమితము యిట్టిదని చెప్పలేము. అనంతము అగాధమైనది. అదియే immorality అన్నారు. What is the way to immortality. Removal of immorality is the only way to immortality. నెగిటివ్ అంతా పదలండి. యివన్నీ మీరు దూరం చేయాలి. అప్పుడే immorality చేరుతుంది. కోపము, తాపము, ఈర్ష్య, అసూయ వీటన్నింటిని దూరము చేసుకోవాలి. ఈ అరిషడ్వర్గములు కామ క్రోధ లోభ మద మాత్సర్యములు సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టక, వక్రమమైన మార్గములో ప్రవేశపెడుతున్నారు. దానివల్లనే దుఃఖమునకు గురైపోతున్నారు. క్రోధము చెడ్డది కాదు. ద్వేషము చెడ్డది కాదు. ద్వేషముండాలి, దేనిపైన. భావమునకు విరుద్ధమైన దానిపై ద్వేషము పెట్టుకోవాలి. అది నిజమైన గొప్పతనము. అప్పుడు అది కూడా పాజిటివ్ అవుతుంది. పాజిటివ్, నెగిటివ్ ఉపకారము చేయటానికి, మంచి పని చేయటానికి ఏది అవసరము వస్తుందో అది అంతా పాజిటివ్. Selfish భావములో పెట్టుకున్నప్పుడు అది నెగిటివ్. Selfish అనేది దూరము చేసుకుని selfless లో మనం ప్రయాణం చేయాలి. అప్పుడే సరైన మానవత్వమును పోషించుకున్న వారమవుతాము.

**పవిత్ర కర్మలే విద్యార్థి లక్ష్యము**

విద్యార్థులారా! ఎక్కడైనా సరే మీ జీవితములోపల వ్యక్తిత్వమునకు చోటు యివ్వకండి. కర్తవ్యమునకు విలువ యివ్వండి. Duty is God. Work is worship. నీ duty కి సరైన విలువ యివ్వాలి. నేను ధనవంతుడనే, నేను విద్యావంతుడనే అనే ప్రమాణాలు తీసుకోకూడదు. యివన్నీ attachment. ఈ attachment కు లొంగకూడదు. యీ attachment కు పొంగకూడదు. పొంగి, కృంగని దివ్యత్వమును మీరు పొందాలి. పిల్లలు చదువుకోటానికి వచ్చారు. చక్కగా చదవండి. చదివిన దానిని చక్కగా అర్థము చేసుకోండి. అర్థము చేసుకున్న దాన్ని పదిమందికి పంచండి. పదిమందికి పంచి మీరు కూడా అనుభవించండి. ఎక్కడికిపోయినా, ఏ ఉద్యోగములో చేరినా ఆ

sri sathyasai vahini vachanamrutam

ఉద్యోగమునకు తగిన పని మీరు చేయాలి. నీ ఉద్యోగమునకు తగిన salary వాళ్లు యిస్తుంటారు. ఆ salary కి తగిన పని మీరు చేయాలి. నీకు నీవు విచారించుకోవాలి. నేను దీనికి తగిన పని చేస్తున్నానా లేదా? దానికి తగిన పని చేసినప్పుడే అది పాజిటివ్ అవుతుంది. లేకపోతే అది కూడా నెగిటివ్ అయిపోతుంది. ఇలాంటి చిన్న చిన్న విషయాలలో పాజిటివ్ నెగిటివ్‌లు తేల్చుకోటానికి వీలవుతుంది. ఈ ధనము ఎక్కడనుంచి సంపాయించారు. సమాజము నుండి సంపాయించారు. తిరిగి సమాజమునకే ఉపయోగించాలి. ఈ సమాజమునకు మనము ఉపయోగపెట్టినప్పుడు పాజిటివ్ అవుతుంది. ఆ విధమైన త్యాగభావముతో జీవించుటకు ప్రయత్నము చేయాలి. అందువలనే వేదము చెప్పింది. 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః'. అప్పుడే నీ హృదయము పవిత్రమైపోతుంది. నీ హృదయము చాలా విశాలమైపోతుంది. దయాహృదయుడై జీవిస్తావు. దయగల హృదయమే దైవమందిరమైపోతుంది. మీ హృదయ మందిరమును దైవమందిరముగా మార్చుకోండి. దైవ భావముతో దైవముగానే జీవించటానికి పూనుకోండి. ఎవరిని బాధించక, నొప్పించక తప్పించుకు తిరిగే ఉపాయాన్ని వెతుక్కోండి. అదే జీవితము యొక్క లక్ష్యము. అదే ఆదర్శవంతమైన జీవితము. అదే నిజమైన సాలోక్య జీవితము. నిత్య జీవితములోనే సాలోక్యము ఉంది. నిత్యజీవితములోనే సాయుజ్యము ఉంటున్నాది. ఆ దైవత్వమును నీవు ఆనందంగా తలచుకుంటే అదే నీకు సాయుజ్యంగా మారిపోతుంది. సాధనలతోను, భజనలతోను మీరు తృప్తి పడిపోకండి. భజనలో tunes వేసే దానికంటే నీ హృదయములో తగిన భావాలు అభివృద్ధిపరచుకో. నీ మృగభావాలు దూరము చేసుకో. నీ దుర్భావములు దూరము చేసుకో. ఇదే భజన చేసినందుకు సరైన గుర్తు. ఒక పక్క భజన చేస్తూ కూర్చోటం, దుర్భావములు దుశ్చింతలు, దురాలోచనలు లోపల నింపుకుంటూ కూర్చుంటే యింక భజన చేసి ప్రయోజనము ఏమిటి? ఇలాంటి భజన కేవలం ఒక నెగిటివ్ భజనే అయిపోతుంది. ఇది కేవలం టేపురికార్డు మాదిరి తయారౌతుంది. మనం టేపురికార్డు కాకూడదు. ఆదర్శము నిరూపించాలి. పాటలు పాడిన భావములంతా మన హృదయములో ప్రింటు అయిపోవాలి. అప్పుడే నీవు, నీ హృదయము రెండు ఒక్కటై పోతాయి. ఈ విధమైన భావాలు పిల్లలు



srisathyasaivachanamrutam

పెంచుకుంటే నాకెంతో ఆనందము. ఇలాంటి పిల్లలు దేశములో ప్రవేశించి ఎంతో ఆదర్శముగా మీరు జీవితాన్ని గడపవచ్చు. **నేను యింతగా మిమ్మల్ని దగ్గర చేర్చి యిన్ని విధాల పోషించి, యిన్ని విధాల చదువుచెప్పి, ఆదరించినందుకు నాకు కావలసినది ఒక్కటే. మీరు మంచి పేరు తెచ్చుకోండి. అంతకంటే నాకు ఏమీ అక్కరలేదు. మీరు మంచి పేరు తెచ్చుకుంటే మీ తల్లిదండ్రులకు ఆనందము. అదే నాకు ఆనందము. అంతకంటే నాకు యివ్వవలసిన ఆనందము లేదు. నేను ఏదీ కోరటం లేదు.** ఈవిధంగా మీరు చక్కగా జీవించి, ఈ institute పిల్లలు ఆదర్శవంతులుగా రూపొందాలి. ఆవిధమైన జీవితాన్ని గడపాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా దీర్ఘప్రసంగాన్ని విరమిస్తున్నాను. నా విషయములో మీరు జాగ్రత్తగా ఉండాలి. నేను ఏవిషయంలోను నెగిటివ్‌గా తయారుకాను. ఎలాంటి పరిస్థితిలోను నెగిటివ్‌కాను. ఎప్పుడు నేను పాజిటివ్. దీనికి నేను సిద్ధము. కానీ పెడార్థమునకు చోటు యివ్వకుండా, అనర్థానికి చోటు యివ్వకుండా యదార్థమును మనస్సులో పెట్టుకొని దివ్యత్వాన్ని దర్శించండి. అదే నేను కోరేది. మీయందున్న మానవత్వమును మొట్టమొదట తీసుకోండి. పశుత్వము చూడకండి. ఆ మానవత్వము నుండి దైవత్వమునకు ప్రవేశించాలి. పెద్దలను గౌరవించండి. ఎవరు మనకు మేలు చేసారో వారు చేసిన మేలు మరచిపోకూడదు. Help ever hurt never. ఇదే భారతము యొక్క ప్రధాన సూత్రము. కేవలము వేదములు, వేదశాస్త్రములు చదివి ప్రయోజనం లేదు. గొల్లకాపరి వచ్చి సమాధానము చెప్పి సంతృప్తి పరచాడు. కాబట్టి యిది పండితులతో జరిగేది కాదు. పండితులతో జరిగేవి కేవలం వాదోపవాదములే. ఈ వాదోపవాదముల వల్ల ద్వేషము పెరిగిపోతుంది. వాదోపవాదము, వైరము పెంచుకోకూడదు. తెలియనప్పుడు వాదనలు చేయవద్దు. నోరుమూసుకుని కూర్చో. అంతే చాలు. ఈనాడు నీవు తెరచవలసింది హృదయాన్ని. మూయవలసింది నోరును. కానీ నోరును తెరుచుకుంటున్నారు, హృదయాన్ని మూసివేస్తున్నారు. అదే పెద్ద నెగిటివ్. హృదయాన్ని తెరవాలి, నోరును మూయాలి. అదే పాజిటివ్. ఆవిధమైన పాజిటివ్ జీవితాన్ని గడపటానికి ప్రయత్నం చేయండి. ఎక్కువ మాట్లాడకండి. ఎవరిని బాధ పెట్టకండి. ఈవిధమైన మంచిమాటలతో మీ జీవితాన్ని ఆదర్శంగా నిరూపిస్తారని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. మ్యూజిక్

srisathyasaivachanamrutam

పిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎంత పాడుతున్నారో అంత భావాలు మార్చుకోవాలి. ట్యూన్సుతోబాటు హృదయభావము అభివృద్ధి కావాలి. హృదయములో మంచి భావము లేకుండా బయట మంచి గంభీరంగా పాడినా అది నాకు వినటానికి ఇష్టము ఉండదు. హృదయము మంచి చేసుకుని ఏవిధంగా పాడినా అది నాకు ఆనందమే. హృదయాన్ని పరిశుద్ధం చేసుకుంటే రాగతాళములు వాటంతట అవే వస్తాయి. కబీరు చెప్పాడు ఒకానొకసమయంలో 'రామా నేను యోగాభ్యాసము చేయలేకుండాపోతున్నాను. ధ్యానము నేను సల్ప లేకపోతున్నాను. జపము నేను చేయలేకపోతున్నాను. ఏవిధంగాను నేను నీ దగ్గరకు చేరేది. ఈ పాంచభౌతిక శరీరము అనేక రోగములతో నిండి ఉన్నది. దీనివల్ల నేను చేరలేను. ఒక్కటి మాత్రం నా దగ్గర ఉన్నాది. దానితో నీవు తప్పించుకొనటకు వీలుకాదు. దాంతో నిన్ను కట్టి వేస్తాను. అది ఏమి అనుకున్నావో ఏమో. నా దగ్గర ప్రేమపాశం ఉంటున్నది. ఆ ప్రేమ అనే తాడుతో కట్టివేస్తాను అని అన్నాడు. అప్పుడే రాముడు ప్రత్యక్షమయ్యాడు. 'నాయనా! నేను చిక్కేది ప్రేమకి మాత్రమే. అదే నాకు కావలసిన తాడు. ఆ ప్రేమ తాడుతో ఏదానినైనా సాధించవచ్చు. ప్రేమను పట్టుకోండి. ప్రేమను అభివృద్ధి చేసుకోండి. ప్రేమమయులుగా మారండి. ప్రేమయే మీరైపోండి. అదే ప్రేమమయ జీవితమైపోతుంది. పాటలు పాడుతుంటే రాగతాళములు పోతున్నాయని ఏమాత్రము యోచన చేయకండి. ప్రేమను లోపల పెట్టుకొని పాట పాడండి అది సరైన శృతికి వస్తుంది. పరీక్ష చేయండి. ప్రేమ లేకుండా ప్రయత్నము చేస్తే అది అపస్వరమే వస్తుంది. ప్రేమతో చేయండి. శృతి లయ తాళములు చేరిపోతాయి.

**(తేదీ 15-02-1998న ప్రశాంతినిలయము హాస్టలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam